## గెలుపు బాటలో శ్రీనిధి

**ఐ-లీగ్ చాంపియన్‌షిప్**



పంజాబ్: ప్రతిష్ఠాత్మక ఐ-లీగ్‌లో శ్రీనిధి దక్కన్ ఎఫ్‌సీ టీమ్ మళ్లీ గెలుపు బాట పట్టింది. ఆదివారం నమ్‌దారీ స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్‌లో శ్రీనిధి ఎఫ్‌సీ 1-0 తేడాతో అద్భుత విజయం సాధించింది. ఆది నుంచే తమదైన జోరు కనబరిచిన శ్రీనిధి తరఫున లాల్‌రోమవియా తొలి అర్ధభాగంలో చేసిన గోల్‌తో 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది. రియల్ కశ్మీర్‌తో గత మ్యాచ్ పోలిస్తే..ఢిల్లీతో పోరులో చీఫ్ కోచ్ కార్లోస్ వాజ్ పింటో మూడు మార్పులు చేశాడు. ఈ పోరులో శ్రీనిధి 4-3-3 వ్యూహాన్ని ఎంచుకోవడం కలిసొచ్చింది. ఈ విజయంతో పాయింట్ల పట్టికలో మొహమ్మదీన్ తర్వాత శ్రీనిధి రెండో స్థానంలో కొనసాగుతున్నది.

## మోనా, ఆదిత్య జోడీకి రజతం

- **పారా షూటింగ్ ప్రపంచకప్**

న్యూఢిల్లీ: ప్రతిష్ఠాత్మక పారా షూటింగ్ ప్రపంచకప్‌లో భారత జోడీ మోనా అగర్వాల్, ఆదిత్య గిరి రజత పతకంతో మెరిసింది. ఆదివారం జరిగిన మిక్స్‌డ్ టీమ్ ఎయిర్ రైఫిల్ స్టాండింగ్ (ఎస్‌హెచ్1) విభాగం ఫైనల్లో మోనా, ఆదిత్య ద్వయం 4-16తో జాంగ్ యిక్సిన్, డాంగ్ చావో (చైనా) చేతిలో ఓటమిపాలైంది. మోనా, ఆదిత్య ఇద్దరు కలిసి 622.9 పాయింట్లు నమోదు చేస్తే.. చైనా జోడీ 627.9 పాయింట్లతో పసిడి కైవసం చేసుకుంది. మరోవైపు మిక్స్‌డ్ టీమ్ 10మీ ఎయిర్ పిస్టల్ తుది పోరులో మనీశ్ నార్వల్, రుబీనా ఫ్రాన్సిస్ జంట 12-16తో లి మిన్, యాంగ్ చావో(చైనా) చేతిలో ఓడి రజతం ఖాతాలో వేసుకుంది. ఇదే విభాగంలో భక్తిశర్మ, రుద్రాంశ్ కండేల్‌వాల్ జోడీ కాంస్యం దక్కించుకుంది. మిక్స్‌డ్ టీమ్ ఎయిర్ రైఫిల్ స్టాండింగ్(ఎస్‌హెచ్2) ఈవెంట్ లో భారత్‌కు చెందిన పావని బానోతు, సత్య జనార్దన జోడీ కాంస్యం ఖాతా లో వేసుకుంది.

# కుర్రాళ్లోయ్.. కుర్రాళ్లు



గిల్ ధ్రువ్

'పెద్ద పెద్ద స్టార్లు లేకపోయినా ఇంగ్లండ్‌పై భారత్ విజయదుందుభి మోగించింది. కోహ్లీ, షమీ, రాహుల్ టెస్టు సిరీస్‌కు దూరమైనా..యువ క్రికెటర్లు యశస్వి జైస్వాల్, సర్ఫరాజ్‌ఖాన్, ధృవ్ జురెల్, దేవదత్ పడిక్కల్ తమ సత్తా ఏంటో ప్రపంచానికి చాటిచెప్పారు. దేశానికి ప్రాతినిధ్యం వహించాలన్న కలను సాకారం చేసుకుంటూ కుర్రాళ్లు టీమ్‌ఇండియా చిరస్మరణీయ విజయాల్లో పాలుపంచుకున్నారు. బజ్‌బాల్‌తో భారత గడ్డపై అడుగుపెట్టిన ఇంగ్లండ్‌కు దిమ్మతిరిగే రీతిలో సమాధానమిస్తూ మట్టికరిపించారు. గతంలోనూ ఆస్ట్రేలియాపై చేతల్లో చూపెట్టారు' అని క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ అన్న మాట ఇది. ఇక్కడే అర్థమవుతుంది..స్టార్ క్రికెటర్ల గైర్హాజరులో యువకులు అవకాశాలను అద్భుతంగా అందిపుచ్చుకుంటూ ఇంగ్లండ్‌ను ఓడించిన తీరు విమర్శకుల ప్రశంసలు అందుకుంటున్నది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 0-1తో వెనుకబడినా.. ఆత్మవిశ్వాసం కోల్పోయిన రోహిత్‌సేన..కుర్రాళ్ల ప్రతిభను నమ్ముకుని అనుకున్న ఫలితం రాబట్టింది. ఈ నేపథ్యంలో సిరీస్ విజయంలో కీలకమైన యువ క్రికెటర్లపై ప్రత్యేక కథనం.

**నమస్తే ప్రత్యేకం**

**జైస్వాల్ ధమాకా:**

జైస్వాల్..వైజాగ్ టెస్టులో తనలో కొత్త కోణాన్ని ఆవిష్కరించాడు. ఇంగ్లండ్ బౌలింగ్ దాడిని సమర్థంగా తిప్పికొడుతూ డబుల్ సెంచరీతో కదంతొక్కాడు. జట్టు మొత్తంలో జైస్వాల్ డబుల్ సెంచరీ తర్వాత అత్యధిక స్కోరు 34(గిల్) పరుగులే కావడం విశేషం. అంటే జట్టు బ్యాటింగ్ భారాన్ని మొత్తం జైస్వాల్ తన ఒంటిచేత్తో మోశాడు. అద్భుతమైన పరిణతి ప్రదర్శిస్తూ ఇంగ్లండ్ బౌలర్లను ఎదుర్కొన్న తీరు నభూతో నభవిష్యత్ అని చెప్పాలి. ముంబై మైదానాల్లో క్రికెట్ ఓనమాలు దిద్దిన జైస్వాల్..టీమ్‌ఇండియా భవిష్యత్ ఆశాకిరణంగా కనిపిస్తున్నాడు. రాజ్‌కోట్ టెస్టులోనూ జైస్వాల్ డబుల్ సెంచరీతో కదం తొక్కాడు. తొలి ఇన్నింగ్స్‌లో సింగిల్ డిజిట్ స్కోరుకే ఔటైనా..మలి ఇన్నింగ్స్‌లో అజేయ ద్విశతకంతో అదరగొట్టాడు. అసలు ఇంత సలువుగా పరుగులు కొల్లగొట్టవచ్చా అన్న రీతిలో ఇంగ్లండ్ బౌలర్ల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తూ సిరీస్‌లో రెండో డబుల్ సెంచరీని ఖాతాలో వేసుకున్నాడు. నాలుగోదైన రాంచీ టెస్టులో తొలి ఇన్నింగ్స్‌లో అర్ధసెంచరీ(73) చేసిన జైస్వాల్..రెండో ఇన్నింగ్స్‌లోనూ సత్తా చాటాడు. ఆఖరిదైన ఐదో టెస్టులో తొలి ఇన్నింగ్స్‌లో అర్ధసెంచరీ సాధించాడు. మొత్తంగా సిరీస్‌లో 712 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచి 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' కైవసం చేసుకున్నాడు. ఈ క్రమంలో దిగ్గజ గవాస్కర్ సరసన నిలిచాడు.

**సర్ఫరాజ్ సూపర్:**

దేశవాళీ టోర్నీల్లో టన్నుల కొద్ది పరుగులు సాధించి జాతీయ జట్టు పిలుపు కోసం ఇన్నాళ్లు వేచిచూసిన ముంబైకర్ సర్ఫరాజ్‌ఖాన్ కల ఇన్ని రోజులకు నెరవేరింది. తన తండ్రి ఆశయాలకు అనుగుణంగా అరంగేట్రం టెస్టులో అర్ధసెంచరీలతో తన సత్తాచూపెట్టాడు. నాలుగో టెస్టులో నిరాశపరిచినా సర్ఫరాజ్.. ధర్మశాల పోరులో కీలక అర్ధసెంచరీతో భారత భారీ స్కోరుకు బాటలు వేశాడు. మొత్తంగా మూడు మ్యాచ్‌ల్లో 50 సగటుతో 200 పరుగులు చేశాడు.

**జురెల్ మెరుపుల్:**

రాజ్‌కోట్ టెస్టు ద్వారా అరంగేట్రం చేసిన ఈ యువ వికెట్‌కీపర్, బ్యాటర్ తన ఆగమనాన్ని ఘనంగా చాటుకున్నాడు. శ్రీకర్ భరత్ స్థానంలో జట్టులోకొచ్చిన జురెల్ తొలి మ్యాచ్‌లో 46 పరుగులతో ఆకట్టుకున్నాడు. రాంచీ టెస్టులో సహచరులు విఫలమైన చోట జురెల్ సాధికారిక ఇన్నింగ్స్‌తో జట్టును నిలబెట్టాడు. 90 పరుగులతో భారత్‌ను ఒడ్డును పడేయడంలో కీలకమయ్యాడు. ఇంగ్లిష్ బౌలింగ్ దాడిని నిలువరిస్తూ స్కోరుబోర్డుకు కీలక పరుగులు జతచేశాడు. అదే జోరు కొనసాగిస్తూ లక్ష్యఛేదనలో గిల్‌తో కలిసి జట్టు గెలుపు బాట పట్టించి 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. సిరీస్‌లో 190 పరుగులతో ఆకట్టుకున్నాడు.



జైస్వాల్

## సంగీతకు స్వర్ణం

**ఫెడరేషన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్**



హైదరాబాద్, ఆట ప్రతినిధి: లక్నో(ఉత్తరప్రదేశ్) వేదికగా జరుగుతున్న 22వ జాతీయ జూనియర్ అండర్-20 ఫెడరేషన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో రాష్ట్ర యువ అథ్లెట్ సాయిసంగీత స్వర్ణ జోరు కొనసాగుతున్నది. ఆదివారం జరిగిన మహిళల 200మీటర్ల రేసును సంగీత 24.58 సెకన్లలో ముగించి అగ్రస్థానంలో నిలిచి పసిడి ఒడిసిపట్టుకుంది. ఆది నుంచి తనదైన జోరు కనబరిచిన ఈ హకీంపేట స్పోర్ట్స్ స్కూల్ అథ్లెట్ సత్తాచాటింది. ఇదే విభాగంలో పోటీపడ్డ అభినయ రాజరాజన్(తమిళనాడు), మిస్తి కజ్లా(రాజస్థాన్) వరుసగా రజత, కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. ఇదే టోర్నీలో ఇప్పటికే సంగీత 400మీటర్ల రేసులో స్వర్ణం సాధించిన సంగతి తెలిసిందే.

## చాంప్ సాత్విక్, చిరాగ్ జోడీ

- **ఫ్రెంచ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ**



పారిస్: భారత స్టార్ జోడీ సాత్విక్‌సాయిరాజ్, చిరాగ్‌శెట్టి టైటిళ్ల వేట దిగ్విజయంగా కొనసాగుతున్నది. పారిస్ టోర్నీపై తమ ప్రేమను కనబరుస్తూ రెండోసారి టైటిల్‌ను సగర్వంగా ముద్దాడారు. ఆదివారం జరిగిన పురుషుల డబుల్స్ ఫైనల్ పోరులో సాత్విక్, చిరాగ్ ద్వయం 21-11, 21-17తో చైనీస్ తైపీ జోడీ లీ జీ హ్యుయ్, యాంగ్ పో హుసాన్‌పై అద్భుత విజయం సాధించింది. 37 నిమిషాల్లోనే ముగిసిన పోరులో ఈ ప్రపంచ నంబర్‌వన్ జోడీ ఆద్యంతం తమదైన ఆధిపత్యం ప్రదర్శించింది. ఆది నుంచే తమదైన దూకుడు కనబరిచిన సాత్విక్, చిరాగ్..ప్రత్యర్థికి ఎలాంటి అవకాశమివ్వలేదు. 2019లో రన్నరప్‌గా నిలిచిన ఈ యువ జంట..2022లో టైటిల్ విన్నర్‌గా నిలిచింది. ఈ సీజన్‌లో తొలి టైటిల్‌ను ఖాతాలో వేసుకుని తమకు తిరుగులేదని ఘనంగా చాటిచెప్పారు. ఇటీవల మలేషియా సూపర్-1000 టోర్నీ, ఇండియా సూపర్-750, చైనా మాస్టర్స్ టోర్నీల్లో రన్నరప్‌గా నిలిచిన సాత్విక్, చిరాగ్..ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్‌తో సత్తా చాటారు. రానున్న ప్రతిష్ఠాత్మక పారిస్ ఒలింపిక్స్‌లో సాత్విక్, చిరాగ్ జోడీ కచ్చితంగా స్వర్ణం సాధిస్తుందని చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ ధీమా వ్యక్తం చేశారు.

## ముంబై 224 ఆలౌట్

**విదర్భతో రంజీ ఫైనల్**

ముంబై: ముంబై, విదర్భ రంజీ టైటిల్ పోరు రసవత్తరంగా సాగుతున్నది. వాంఖడే స్టేడియం వేదికగా ఆదివారం మొదలైన ఫైనల్లో ముంబై తొలి ఇన్నింగ్స్‌లో 224 పరుగులకు ఆలౌటైంది. స్టార్ బ్యాటర్లు రహానే(7), శ్రేయాస్ అయ్యర్(7) విఫలమైన చోట ఆల్‌రౌండర్ శార్దుల్ ఠాకూర్(75) మరోమారు తన విలువ చాటుకున్నాడు. 81-1 స్కోరుతో మెరుగైన స్థితిలో కనిపించిన ముంబై 111 పరుగులకే ఆరు వికెట్లు కోల్పోయింది. ఈ తరుణంలో శార్దుల్ కీలక ఇన్నింగ్స్‌తో జట్టును గాడిలో పడేశాడు. ఈ సీజన్‌లో సూపర్ ఫామ్‌లో ఉన్న శార్దుల్ సాధికారిక ఇన్నింగ్స్‌తో ముంబై తేరుకుంది. వన్డే తరహాలో ఆడిన శార్దుల్ 69 బంతుల్లో 75 పరుగులు చేశాడు. హర్ష్ దూబే, యశ్ ఠాకూర్ మూడేసి వికెట్లు తీశారు. ఆ తర్వాత తొలి ఇన్నింగ్స్‌కు దిగిన విదర్భ 3 వికెట్లకు 31 పరుగులు చేసింది. అథర్వ (21), ఆదిత్య (0) క్రీజులో ఉన్నారు. ధవల్‌కులకర్ణి రెండు వికెట్లు పడగొట్టాడు.

## ఆసీస్ లక్ష్యం 279

**కివీస్‌తో రెండో టెస్టు**

క్రైస్ట్‌చర్చ్: ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ మధ్య రెండో టెస్టు రసవత్తరంగా సాగుతున్నది. కివీస్ నిర్దేశించిన 279 పరుగుల లక్ష్యఛేదనలో ఆసీస్ మూడో రోజు ఆట ముగిసే సరికి 4 వికెట్ల నష్టానికి 77 పరుగులు చేసింది. చేతిలో ఆరు వికెట్లు ఉన్న కంగారూలు విజయానికి 202 పరుగుల దూరంలో ఉన్నారు. స్మిత్(9), ఖవాజ (11), లబుషేన్ (6), గ్రీన్ (5) సింగిల్ డిజిట్ స్కోర్లకే వెనుదిరిగారు. హెడ్ (17), మిచెల్ మార్ష్ (27) క్రీజులో ఉన్నారు. హెన్రీ(2-37), సీయర్స్ (2-22) రెండేసి వికెట్లు తీశారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 134-2 రెండో ఇన్నింగ్స్‌కు దిగిన కివీస్ 372 పరుగులకు ఆలౌటైంది. లాథమ్ (73), రచిన్ రవీంద్ర (82), మిచెల్(58) అర్ధసెంచరీలతో రాణించారు. కమిన్స్ (4-62), లియాన్ (3-49) ఆకట్టుకున్నారు.

## భారత్ నంబర్‌వన్

**మూడు ఫార్మాట్లలో అగ్రస్థానం**

దుబాయ్: భారత క్రికెట్ జట్టు తమ సత్తా ఏంటో చూపెట్టింది. సమిష్టి ప్రదర్శన కనబరుస్తూ మూడు ఫార్మాట్లలో నంబర్‌వన్ జట్టుగా అవతరించింది. ఆదివారం ఐసీసీ విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో టెస్టులు, వన్డేలు, టీ20ల్లో టీమ్‌ఇండియా అగ్రస్థానాన్ని అధిష్ఠించింది. ఇంగ్లండ్‌తో ఐదు టెస్టుల సిరీస్‌ను 4-1తో కైవసం చేసుకోవడం ద్వారా భారత్ తమ టాప్ ర్యాంక్‌ను మరింత పటిష్ఠం చేసుకుంది. ఇంగ్లండ్‌తో ఆఖరిదైన ధర్మశాల టెస్టులో ఇన్నింగ్స్ 64 పరుగుల తేడాతో గెలువడం ద్వారా 122 రేటింగ్ పాయింట్లతో నంబర్‌వన్ ర్యాంక్‌లో కొనసాగుతున్నది. ఆస్ట్రేలియా (117), ఇంగ్లండ్ (111), న్యూజిలాండ్ (101) వరుసగా రెండు, మూడు, నాలుగు ర్యాంక్‌ల్లో ఉన్నాయి. మరోవైపు వన్డేల్లో భారత్ 121 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా, ఆస్ట్రేలియా (118) ఆ తర్వాత ర్యాంక్‌లో ఉంది. టీ20ల ర్యాంకింగ్స్ విషయానికొస్తే..266 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో కొనసాగుతుండగా, ఇంగ్లండ్ (256), ఆస్ట్రేలియా (255) వరుసగా రెండు, మూడు ర్యాంక్‌ల్లో ఉన్నాయి.






Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.